'ఆధార్' లేని పిల్లలు 1,583 మంది

- రేపటినుంచి ప్రత్యేక శిబిరాలు
- చిన్నారులందరికీ ఆధార్ కార్డు జారీ అయ్యేలా ప్రభుత్వ చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): శిశువు నుంచి వృద్ధుల వరకు ఆధార్ తప్పనిసరి. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్చాలన్నా ఆధార్ అవసరమే. తాజాగా జిల్లాలో 1,583 మంది పిల్లలకు ఇప్పటికీ ఆధార్ లేదు. వీరి తల్లిదండ్రులు ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా ఈనెల ఐదు నుంచి 8వ తేదీ వరకు, 12 నుంచి 15వ తేదీ వరకు రెండు విడతలుగా ప్రత్యేక ఆధార్ శిబిరాలను 123 కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాల్లో ఆధార్ కార్డు తీసుకోవడంతోపాటు వివరాలను అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు ఆధార్ కిట్లను అందజేశారు. ఈ శిబిరాల్లో ప్రతి చిన్నారికీ ఆధార్ కార్డు జారీ అయ్యేలా చూస్తామని సచివాలయ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు.

బర్త్ సర్టిఫికెట్ మంజూరులో ఆలస్యం

బర్త్ సర్టిఫికెట్ మంజూర్లలో ఆలస్యం కావడంతో ఆధార్ కార్డు తీసుకోవడం లేదని సమాచారం. బర్త్ సర్టిఫికెట్ లేనివారు సుమారు 1,300 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలైన వెంటనే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వల్లే ఇలా జరుగుతోందన్న విమర్శలున్నాయి.

వరసిద్ధుడి ఆలయాభివృద్ధి దాతలకు త్వరలోనే గుర్తింపు కార్డులు

ఐరాల(కాణిపాకం), మే 3 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి విరాళమిచ్చే దాతలకు త్వరలోనే గుర్తింపు కార్డులను జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆలయం వద్ద నిర్వహించే అన్నదానం మొదలుకుని పలు కార్యక్రమాలకు దాతలు తమ వంతు సాయం అందిస్తుంటారు. రూ.లక్ష అంతకుమించి విరాళమిచ్చేవారికి ఈ కార్డులను అందించనున్నట్లు సమాచారం. గుర్తింపు కార్డులను దాతలు ఆన్‌లైన్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను దేవదాయ శాఖ సిద్ధం చేసినట్లు తెలిసింది.

గతంలో ఇలా..

ఆలయానికి విరాళాలు అందించే దాతలకు ప్రస్తుతం వారిచ్చిన నగదుకు సంబంధించి ఓ రశీదును అందించే విధానం ఉంది. దాతలు ఎప్పుడైనా ఆలయానికి వచ్చినప్పుడు ఆ రశీదును చూపితే ప్రత్యేక దర్శనాన్ని అధికారులు కల్పించేవారు. చాలామంది రశీదులను పోగొట్టుకుని ఇబ్బంది పడుతున్న దృష్ట్యా గుర్తింపు కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అధికారులను కలవాల్సిన పని ఉండదు

ఈ గుర్తింపు కార్డు ఉంటే.. స్వామి దర్శనం కోసం ఆలయ అధికారులను కలవాల్సిన పని ఉండదు. నేరుగా వీఐపీ ద్వారం వద్ద నుంచి సులభంగా దర్శనానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. కాకుంటే దర్శనానికి ఎంత మందిని తీసుకెళ్లవచ్చన్న దానిపై రాష్ట్ర దేవదాయ శాఖ ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

పెరగని టమోటా ధరలు

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు



పలమనేరు మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన టమోటాలు

పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌యార్డులో టమోటా ధరలు గణనీయంగా పడిపోయాయి. శనివారం మార్కెట్‌కు 370 మెట్రిక్ టన్నులు రాగా మొదటి రకం కిలో గరిష్ఠంగా రూ.10 ధర పలికింది. మూడు నెలలుగా టమోటా ధరలు పతనావస్థలోనే కొనసాగుతున్నాయి. వచ్చే వారం ధరలు పెరుగుతాయంటూ ఎదురుచూస్తూ వచ్చిన రైతులకు నిరాశే మిగులుతోంది. అయినప్పటికీ టమోటా సాగులో రైతులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతూ ఉండటం గమనార్హం. గత వారం రోజులుగా పాకిస్థాన్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో కర్ణాటక రాష్ట్రం కోలారులోని పెద్ద టమోటా మార్కెట్ నుంచి పాకిస్థాన్‌కు టమోటాల ఎగుమతి నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో ఆ ప్రభావం ఇక్కడ ధరలపై కూడా చూపెడుతోందని అధికారులు చెబుతున్నారు. కేవలం టమోటా ధరలే కాక నెల రోజులుగా బంగాళాదుంప, క్యాబేజి, కాలీఫ్లవర్, క్యారెట్, కాకర, బీర, దోస, చిక్కుడు, బీన్స్ ధరల పతనం కూడా రైతులను మరింత కుంగదీస్తోంది. ఇదే ధరలు మరో నెల రోజులు కొనసాగితే కూరగాయలు సాగు చేసిన రైతులందరూ తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. పడమటి ప్రాంతాల్లో మేటి రైతులు మినహా మిగిలిన వారంతా అప్పులు చేసి కూరగాయల సాగు చేస్తుంటారు. కూరగాయలు మార్కెట్‌కు వచ్చి విక్రయాలు ప్రారంభమైతే చేసిన అప్పులు క్రమేపీ తీర్చుకొంటూ వస్తుంటారు. మరి ఈ ఏడాది ఇందుకు భిన్నంగా చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక మళ్లీ మళ్లీ అప్పులు చేస్తూ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రహదారులకు నిధుల వరద

- ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.72 కోట్లు
- పంచాయతీరాజ్ రోడ్లకు రూ.19.87 కోట్లు
- రూ.31.52 కోట్లతో కొన్ని రోడ్ల మరమ్మతులు ఇప్పటికే పూర్తి



చిత్తూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇదివరకే జిల్లాలోని అనేక గ్రామీణ, పట్టణ ప్రాంత రహదారుల్ని అభివృద్ధి చేయగా.. తాజాగా మరిన్ని రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం ఏకంగా రూ.92 కోట్ల నిధుల్ని కేటాయించారు.వైసీపీ హయాంలో కనీస నిర్వహణ కూడా రహదారులన్నీ ఛిద్రమైపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో రూ.23.12 కోట్లతో 329 రహదారుల మరమ్మతు పనుల్ని మంజూరు చేసింది. అలాగే ఏళ్లగా వాహనదారులకు ఇబ్బందిగా వున్న గుడియాత్తం రోడ్డుకు రూ.5.90 కోట్లు, వేలూరు రోడ్డుకు రూ.2.50 కోట్లు ఉపాధిహామీ నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఆయా పనులన్నీ పూర్తయ్యాయి. దీంతో తాజాగా నాబార్డు నిధులతో మరిన్ని పనులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు శాఖల ద్వారా రూ.92 కోట్లు మంజూరవగా.. అత్యధికంగా కుప్పం నియోజకవర్గానికే కేటాయించారు.

కుప్పంలో చేపట్టే పంచాయతీరాజ్ రోడ్లు

గుడుపల్లె మండలంలోని పొగురుపల్లె రోడ్డు నుంచి దనమానిపల్లె రోడ్డుకు రూ.40 లక్షలు, కేపీ రోడ్డు నుంచి నలగాంపల్లె వరకు రూ.35 లక్షలు, పొగురుపల్లె రోడ్డు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రూ.50 లక్షలు, కుప్పం-కేజీఎఫ్ రోడ్డు నుంచి చింతరపాళ్యం వరకు రూ.53 లక్షలు,టి.అగ్రహారం రోడ్డు నుంచి పెద్దకోటమకనపల్లి వరకు రూ.36 లక్షలతో బీటీ రోడ్లను పునరుద్ధరించ నున్నారు. ●కుప్పం మండలంలోని కుప్పం-పచ్చూరు రోడ్డు నుంచి తెల్లచెరువుకొట్టాలు మీదుగా వసనాడు వరకు రూ.1.20 కోట్లతో, కుప్పం-పచ్చూరు రోడ్డు నుంచి వసనాడు రోడ్డు వరకు రూ.1.30 కోట్లతో.. కుప్పం-వేపనపల్లె రోడ్డు నుంచి మతార్లపల్లె వరకు రూ.40 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. ●రామకుప్పం మండలంలోని గొరివిమాకులపల్లె నుంచి దేశినాయనిపల్లె వరకు రూ.1.20 కోట్లతో.. రామకుప్పం రోడ్డు నుంచి గొరివిమాకులపల్లె వరకు రూ.40 లక్షలతో.. శాంతిపురం మండలంలోని రాళ్లబుదుగూరు రోడ్డు నుంచి శివకురుబూరు వరకు రూ.1.54 కోట్లతో.. దండికుప్పం రోడ్డు నుంచి కడిముతనపల్లె వరకు రూ.45 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు.

కుప్పంలో చేపట్టే ఆర్‌అండ్‌బీ రోడ్లు

కుప్పం- పట్నూరు రోడ్డుకు రూ.3.84 కోట్లు, కుప్పం- మల్లానూరుకు రూ.6.05 కోట్లు, కుప్పం- పలమనేరు రోడ్డుకు రూ.4.05 కోట్లు, కుప్పం-గుడుపల్లె రోడ్డుకు రూ.6.02 కోట్లు, కుప్పం-పెద్దపర్తికుంట రోడ్డుకు రూ.5.16 కోట్లు, రామకుప్పం-విజలాపురం రోడ్డుకు రూ.3.85 కోట్లు, అడవిబుదుగూరు క్రాస్ నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రూ.1.20 కోట్లు, కుప్పం-సంగనపల్లె రోడ్డుకు రూ.70 లక్షలు, కుప్పం-పొగురుపల్లె-గుడుపల్లె రోడ్డుకు రూ.70 లక్షలు, రామకుప్పం-వి.కోట- పేర్నంబట్టు రోడ్డుకు రూ.1.35 కోట్లు, బందార్లపల్లె క్రాస్ నుంచి పాముగానిపల్లె రోడ్డుకు రూ.67 లక్షలు, రామకుప్పం-వి.కోట-పేర్నంబట్టు రోడ్డుకు రూ.1.90 కోట్లు, కుప్పం- చిగురుగుంట రోడ్డుకు రూ.2.65 కోట్లు, గుడ్లూరు నుంచి కర్ణాటక సరిహద్దు రోడ్డుకు రూ.1.85 కోట్లు, గుడ్యాణంపల్లె-చిన్నేపల్లె రోడ్డుకు రూ.85 లక్షలు, 64 పెద్దూరు నుంచి కర్లగట్ట రోడ్డుకు రూ.68 లక్షలు, కుప్పం సరిహద్దు రహదారి నిర్మాణానికి రూ.4.95 కోట్లు, గుడ్యాణంపల్లె రోడ్డుకు రూ.1.15 కోట్లు, కుప్పం-గుడుపల్లె రోడ్డుకు రూ.80 లక్షలు, కుప్పం-పొగురుపల్లె రోడ్డుకు రూ.84 లక్షలు, గుడ్యాణంపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రూ.3.55 కోట్లు, ఎన్‌హెచ్ 219 క్రాస్ రోడ్డుకు రూ.40 లక్షలు, యామిగానిపల్లె రోడ్డుకు రూ.1.05 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయనున్నారు.

మంజూరైన పంచాయతీరాజ్ పనులివే

పంచాయతీరాజ్ తరఫున 20 రోడ్ల మరమ్మతు పనుల్ని చేపట్టనున్నారు.గుడిపాల మండలంలోని ఎన్‌హెచ్4 నుంచి సీకేపల్లె, బసవాపల్లె వరకు రూ.1.20 కోట్లు... పెనుమూరు మండలం సీపీరోడ్డు నుంచి అడవిపల్లె రోడ్డు వరకు రూ.56 లక్షలు... వెదురుకుప్పం మండలంలోని తిరుపతి-కొత్తపల్లిమిట్ట రోడ్డు నుంచి కేపీపీ రోడ్డు వరకు రూ.2.28 కోట్లు... గంగవరం మండలంలోని ఎంబీటీ రోడ్డు నుంచి ఉయ్యాలమిట్ట వరకు రూ.70 లక్షలు... పెద్దపంజాణి మండలంలోని కేసీరోడ్డు నుంచి నాగిరిపల్లె వరకు రూ.2 కోట్లు... పుంగనూరు నుంచి వనమలదిన్నె (రాష్ట్ర సరిహద్దు) వరకు రూ.1.50 కోట్లు... బంగారుపాళ్యం మండలంలోని ఎంసీబీ రోడ్డు నుంచి చంద్రశేఖరపురం వరకు రూ.1.60 కోట్లు... ఐరాల మండలంలోని చిత్తూరు-ఐరాల రోడ్డు నుంచి 45కొత్తపల్లె, అడపగుండ్లపల్లె వరకు రూ.80 లక్షలు... తవణంపల్లె మండలంలోని గాజులపల్లె సరకల్లు రోడ్డు నుంచి ముచ్చుకాలువ వరకు రోడ్డు మరమ్మతు పనులకు రూ.80 లక్షలు కేటాయించారు.

అభివృద్ధి కానున్న ఆర్‌అండ్‌బీ రహదారులివే..

పెద్దమల్లెల- ఎర్రావారిపాళెం రోడ్డుకు రూ.1.50 కోట్లు, చిత్తూరు-పుత్తూరు రోడ్డు నుంచి కమ్మకండ్రిగ రోడ్డుకు రూ.2 కోట్లు, చిత్తూరు-తిరుత్తణి రోడ్డు నుంచి వేలూరు రోడ్డుకు రూ.2 కోట్లు, నగరి నుంచి వెంగన్నకండ్రిగ రోడ్డుకు రూ.2 కోట్లు, పలమనేరు-కృష్ణగిరి బైపాస్‌కు రూ.79 లక్షలు, పలమనేరు-కృష్ణగిరి రోడ్డుకు రూ.40 లక్షలు, వెంకటపల్లె నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రూ.50 లక్షలు, సీకేటీ రోడ్డు-పాకాల-దామలచెరువు రోడ్డుకు రూ.2.20 కోట్లు, రాయలపేట-మాదవరం రోడ్డుకు రూ.2.20 కోట్లు, రాయలపేట- కల్లుపల్లె రోడ్డుకు రూ.4.45 కోట్లు కేటాయించారు.

కుప్పానికే 62.53 కోట్లు..

సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజక వర్గంలోని రహదారులకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. ఆర్‌అండ్‌బీ తరఫున రూ.54.26 కోట్లను, పంచాయతీరాజ్ తరఫున రూ.8.27 కోట్లను.. మొత్తంగా రూ.62.53 కోట్లను కేటాయించారు.



రూ.4.05 కోట్లతో అభివృద్ధి చేయనున్న కుప్పం-పలమనేరు రోడ్డు

నాటుబాంబును తొక్కి గాయపడ్డ గున్న ఏనుగు మృతి



పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి) :నెల క్రితం అడవి జంతువుల వేటకోసం పెట్టిన నాటుబాంబును తొక్కి గాయపడ్డ ఓ గున్న ఏనుగు మృతి చెందింది. పలమనేరు అటవీశాఖ పరిధిలోని గౌని చెరువు వద్ద శనివారం ఆ ఏనుగు కళేబరం కన్పించింది.గత నెల మొదటివారంలో బంగారుపాళ్యం మండలం జమ్మునేరేడుపల్లె తోటల్లో అడవి జంతువులకోసం వేటగాళ్లు పెట్టిన నాటుబాంబు పేలి ఓ కుక్క చనిపోయింది. నాటుబాంబును తొక్కిన గున్న ఏనుగు గాయపడింది.అయితే ఏనుగుల మందతో పాటు వెళ్లిపోయింది.ఈ ఘటనలకు సంబంధించి బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంటకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. నాటుబాంబును తొక్కి గాయపడ్డ గున్న ఏనుగు క్రమేపీ నడవడం కష్టమై బలహీనపడిందని, ఈ పరిస్థితుల్లోనే మందలోని ఏనుగుల మధ్య జరిగిన పెనుగులాటలో గాయపడి చివరకు శక్తిహీనమై చనిపోయిందని అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. ఏనుగు చనిపోయిన విషయాన్ని స్థానిక అటవీక్షేత్ర సిబ్బంది సమాచారమివ్వడంతో పలమనేరు రేంజర్ నారాయణ అటవీశాఖ ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో సీఎఫ్‌వో యశోదాబాయి, డీఎఫ్‌వో భరణి, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఎస్‌వో సుకుమార్ తదితరులు గౌనిచెరువు వద్దకు చేరుకొని ఏనుగు కళేబరాన్ని పరిశీలించారు.తిరుపతిలోని ఎస్వీ జూ వైద్యుడు అరుణ్‌కుమార్, బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట పశువైద్యాధికారి ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం చేశాక అటవీ ప్రాంతంలోనే దహనం చేశారు.



గున్న ఏనుగు కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి



నీట్‌కు సిద్ధమైన చిత్తూరులోని పరీక్ష కేంద్రం

చిత్తూరు సెంట్రల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆదివారం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్టు)కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా నోడల్ అధికారి వైవీ కృష్ణబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 710 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికోసం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సిటీ కోఆర్డినేటర్ జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు తమతో అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ప్రభుత్వంచే గుర్తించబడిన ఏదైనా పత్రం (ఆధార్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు), ట్రాన్స్‌ఫరెంట్ వాటర్ బాటిల్ తీసుకుని రావాలని సూచించారు. పెన్ను పరీక్ష కేంద్రంలోనే ఇస్తారన్నారు. సాధారణ దుస్తుల్లోనే రావాలని.. కమ్మలు, మందపాటి చెప్పులు, బూట్లు, పెద్ద గుండీలు ఉన్న దుస్తులు, ఆభరణాలు, చేతి వాచీలకు అనుమతి లేదన్నారు.

పటిష్ఠ బందోబస్తు, హెల్ప్ డెస్కులు : ఎస్పీ

చిత్తూరు అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్‌కు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల వెంట వచ్చే తల్లిదండ్రులు తమ వాహనాలను పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో నిలుపుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుడ్.. బాగా చేశారయ్యా!

- కుప్పం టీడీపీ శ్రేణులకు చంద్రబాబు అభినందన



కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌ను అభినందిస్తున్న చంద్రబాబు

కుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): 'గుడ్.. బాగా చేశారయ్యా. ఇలాగే కలసికట్టుగా పనిచేయండి.'.... కుప్పం టీడీపీ శ్రేణులకు పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన అభినందన ఇది.కుప్పం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు శనివారం చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. గత నెల 28వ తేదీన కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నికలు జరిగి, వైసీపీ చేతిలోని పీఠం టీడీపీ వశమైన విషయం తెలిసిందే.నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజ్‌ను చైర్మన్ సీటులో కూర్చోబెట్టారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు సమన్వయంతో ఎన్నికల వ్యవహారాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించినా వారిని వెనుక ఉండి నడిపించింది చంద్రబాబే.ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌తోపాటు, కౌన్సిలర్లు, ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు అమరావతిలో చంద్రబాబు పిలుపు మేరకు ఆయనను కలిశారు.శనివారం మధ్యాహ్నం సుమారు ముప్పావు గంటపాటు ఆయనతో సమావేశమయ్యారు.సెల్వరాజ్‌ను శాలువతో సత్కరించి అభినందించిన చంద్రబాబు కుప్పం నేతలపై కూడా ప్రశంసల జల్లు కురిపించారు.నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ఇలాగే కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.కుప్పాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే సింగపూర్ టీం మున్సిపాలిటీలో పర్యటించి, సర్వేలు చేయడం ద్వారా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తుందన్నారు. ఆ ప్లాన్ ప్రకారం కడా ఆధ్వర్యంలో కుప్పం మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి పలు అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. అధికారులతో నేతలు సమన్వయం చేసుకుని వెళ్లాలని సూచించారు.

కుప్పం గంగజాతరకు వస్తా

కుప్పం గంగమాంబ జాతర మహోత్సవాలు ఈనెల 14వ తేదీన గణపతి స్వామి ఉత్సవ ఊరేగింపుతో ప్రారంభమై 21వ తేదీన అమ్మవారి విశ్వరూప దర్శనంతో ముగుస్తాయి. ఈ ఉత్సవాలతోపాటు, గుడుపల్లె మండలం యామగానిపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి మహాభారత ఉత్సవాలు కూడా దాదాపు ఇవే తేదీల్లో జరుగనున్నాయి. ఈ రెండు ఉత్సవాలలో పాల్గొని అమ్మ, స్వామివార్ల ఆశీర్వాదం పొందాల్సిందిగా అధినేత చంద్రబాబును నాయకులు ఆహ్వానించారు.వీలైనంత వరకు కుప్పం గంగ జాతరకు ఏదో ఒక తేదీలో హాజరవుతానని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. అలాగే ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాలలో కూడా పాల్గొంటానని చెప్పారు.

నేడు, రేపు అధిక ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈ రెండ్రోజులు జిల్లాలో 41.5 నుంచి 43 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించింది.అంతేకాకుండా ఆది, సోమవారాల్లో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ప్రజలు చెట్లకింద నిలబడరాదని, బలమైన ఈదురుగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.కాగా శనివారం అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 40.4, తవణంపల్లెలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. చిత్తూరు, గుడిపాల, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 39.7డిగ్రీలు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 39.5, బంగారుపాళ్యంలో 39.1, గంగాధరనెల్లూరులో 38.2, కార్వేటినగరంలో 38.1, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, ఐరాల, నగరి, నింద్ర, పెనుమూరు, విజయపురం, పాలసముద్రం, యాదమరి మండలాల్లో 37.8, సదుంలో 37, రొంపిచెర్ల, సోమల మండలాల్లో 36.8, పుంగనూరులో 36.6, పలమనేరులో 36.4, గుడుపల్లె, శాంతిపురం, వి.కోట మండలాల్లో 36, కుప్పంలో 33.9, రామకుప్పంలో 33.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ధర్మరాజుల స్వామి ఉత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న జీఎం రాజు, ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం యామగానిపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర వన్నెకుల సాధికార సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జీఎం రాజు ఆహ్వానం పలికారు. అమరావతిలోని సీఎం స్వగృహంలో కుప్పం నాయకులు శనివారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవం ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి రాజు సీఎంకు అందజేశారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాలు ఇప్పటికే అంకురార్పణతో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ద్రౌపదీ జననం, ద్రౌపదీ కల్యాణం, అర్జున తపస్మాన్, పుష్పపల్లకి, రథోత్సవం, అర్జునుడు ఆవులను మళ్లించుట, ఇలావంతుని బలి ఉత్సవాలు వరుసగా జరిగి, ఈనెల 19వ తేదీన దుర్యోధన వధ, అగ్నిగుండ మహోత్సవాలు జరుగుతాయి. 20వ తేదీన ధర్మరాజు పట్టాభిషేకంతో మహాభారత ఉత్సవాలు ముగుస్తాయి. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి సేవించుకునే ఈ మహోత్సవాలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా విన్నవించారు. ఆయన ఆహ్వానాన్ని మన్నించిన చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వీలుచూసుకుని రావడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు వీరివెంట ఉన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

● సింహ వాహనంపై ఊరేగిన మృత్యుంజయేశ్వరుడు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు - సింహ వాహనంపై ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే 3 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి స్వామి వారిని సింహ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, విద్యుత్ దీపాల అలంకరణలో కోలాహలంగా పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ధ్వజారోహణం పద్మశాలి కులస్థులు, సింహ వానానికి విశ్వబ్రాహ్మణ కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



పుంగనూరులో పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు సాధన కమిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ రేగంటి దేవానంద్ తెలిపారు. శనివారం పుంగనూరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 57 మెమోను అమలు చేయాలని కోరుతూ, తమ సమస్యలు తీర్చాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు పోస్టుకార్డుల ద్వారా ఉత్తరాలు రాస్తున్నట్లు తెలిపారు. దేశంలో 15 రాష్ట్రాల్లో పాత పింఛన్ పద్ధతిని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పాత పింఛన్ పద్దతిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డి, రాజేశ్వరి, సందీప్, శ్రీధర్, మణి, విజయ్‌కుమార్, మోహన్, కిరణ్, రమణ, నాగరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



వెంకటసిద్దులు, సుధాకర నాయుడు, ఇషాన్

కల్లూరు, మే 3 (ఆంధ్ర జ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలి తెలిపారు. కల్లూరు లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, అన్ని పదవులు ఏకగ్రీవమయ్యాయి. కల్లూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకటశిద్దులు, కార్యదర్శిగా ఇషాన్, కోశాధికారిగా సుధాకర నాయుడు, కార్యనిర్వాహక అధికారిగా పోకల తాతయ్య, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర, ప్రకాష్, డైరెక్టర్లుగా రాజన్, చాన్‌బాషా, రాజారెడ్డి, లావణ్య, అర్షాద్ ఎన్నికయ్యారు. మహమ్మదాలి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఏడాదిపాటు కొనసాగుతుందని, లయన్స్ క్లబ్ సేవలు అందిస్తుందని తెలిపారు. వీరి ఎంపికపై లయన్స్‌క్లబ్ ప్రాంతీయ అధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధనపు కోశాధికారి రాజారెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి శివ, వరదారెడ్డి, రామయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ఆదర్శ రైతును సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ విస్తరణ సిబ్బంది

రామకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చునని ఎంటీ లక్ష్మీరెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని గడ్డూరులో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. గ్రామంలో రైతులందరూ పూర్తి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులను సన్మానించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంటీ జయప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సమైక్య సిబ్బంది, వీవోలు, వీవో లీడర్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన చౌడేశ్వరమ్మ బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో చౌడేశ్వరి అమ్మ

రామకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం జవుకులపల్లెలో వెలసిన చౌడేశ్వరమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హరికథాలాపన భక్తులను అలరించింది. రాత్రి అమ్మవారిని విద్యుత్ దీప, పుష్పాలంకృత పల్లకిలో డప్పుహోరు, మంగళ వాయిద్యాలతో గోవిందపల్లె, జవుకులపల్లె, జంపూరు, మరువూరుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. గోవిందపల్లెలో ఏర్పాటు చేసిన సినీ గీతాల నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది.

పుంగనూరు మున్సిపాలిటీకి రెండు ట్రాక్టర్ల మంజూరు



నూతన ట్రాక్టర్లను పరిశీలిస్తున్న చైర్మన్ అలీంబాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపాలిటీకి రెండు ట్రాక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. శనివారం నూతనంగా వచ్చిన ట్రాక్టర్లను వారు పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో చెత్తను తరలించడానికి ఇబ్బందిగా ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం రెండు ట్రాక్టర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ డీఈ మహేశ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంటప్ప తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ జాండ్రపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాలభైరవేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం అట్టహాసంగా ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తెలిపారు. గణపతిపూజ, పుణ్యాహవచకం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, తీర్థ వినియోగం నిర్వహించారు. మంగళవారం వరకు వేడుకలు కొనసాగుతాయని, భక్తులు పాల్గొనాలని అర్చకులు కోరారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



ప్రభుత్వాస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రి ఎదుట శనివారం పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న తమకు కాంట్రాక్టు తీసుకొన్న వ్యక్తి గత మూడునెలలుగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. కాగా సదరు కాంట్రాక్టరు కాంట్రాక్టు మే నెలతో ముగిసిపోతున్నందున అధికారులు స్పందించి తమకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 4వ తేది ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు మురళి కంటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రికి తీసుకెళ్లి, ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి తిరిగి తీసుకొస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభాకర్ కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

సోమల, మే 3(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శివశంకర్ పేర్కొన్నారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో వాహనాలు తనిఖీ నిర్వహించి, వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించి వాహనాలు నడపాలన్నారు. ప్రమాద సమయంలో తల, మెదడును హెల్మెట్ కాపాడుతుందన్నారు. రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు.

కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు

సోమల, మే 3(ఆంధ్రజ్యోతి): కౌమార బాలికలకు కిశోరి వికాసంపై కందూరు సచివాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. సూపర్‌వైజర్ హరిత మాట్లాడుతూ.. బాలల హక్కులు, బాలసంరక్షణ, బాల్య వివాహాలు, జీవన నైపుణ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు

పుంగనూరు, మే 3(ఆంధ్రజ్యోతి): పుంగనూరు బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు ఘనంగా అమ్మవారి జయంత్యుత్సవాలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం వైశ్యపతాక ఆవిష్కరణ, పుష్కరిణి నుంచి గంగాజలాలు తీసుకురావడం, కలశస్థాపన, నవగ్రహ ఆరాధన, వాసవీ అమ్మవారికి అభిషేకాలు, 5వ తేదీ వాసవీ అమ్మవారి జీవిత చరిత్రపై నాటిక, కనక మహాలక్ష్మి పూజ, 6న వాసవీవ్రతం, దర్పణపూజ, 7న అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా 102 కలశాలతో అభిషేకాలు, శ్రీసూక్తం, సప్తమాతృకపూజ, వాసవీదేవి హోమం, పుష్పపల్లకిలో అమ్మవారి ఊరేగింపు, 8న వాసవీదేవి ఉయ్యాలసేవ తదితర కార్యక్రమాలు స్థానిక మంజునాథస్వామి దీక్షితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతాయని చెప్పారు.

బాలుర వసతి గృహానికి సొబగులు



రంగులు వేసిన బాలుర వసతి గృహం - పైపులైన్లకు మరమ్మతులు - డోర్లు తయారు చేస్తున్న కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొంపిచెర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహానికి మరమ్మతులు చేస్తూ రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'దుస్థితిలో రొంపిచెర్ల బాలుర వసతి గృహం.. అవస్థలు పడుతున్న విద్యార్థులు' అనే వార్త ప్రచురితమైంది. ఈమేరకు అధికారులు స్పందించి రూ.11.80 లక్షల నిధులు మంజూరు చేశారు. గదుల పైకప్పులో ఊడిన పెచ్చుల పనులు, మెస్ డోర్ల రిపేర్లు చేశారు. ప్రహరీగోడ నిర్మాణం, మరుగుదొడ్లు, స్నానపు గదుల్లో పైపులైన్ల మరమ్మతులు చేస్తున్నారు. ఆవరణలో మట్టి తోలకం, భవనానికి రంగులు వేయడం వంటి పనులు చేస్తున్నారు. రానున్న ఏడాదికి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండవని వార్డెన్ సురేశ్‌రెడ్డి తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు నాగమంగళం అనుకూలం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు పలమనేరు ఎంతో అనుకూలమైన ప్రాంతమని, నూతన పారిశ్రామికవేత్తలకు ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేలా అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శనివారం పలమనేరులోని తన కార్యాలయంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావుతో ఆయన సమావేశమయ్యారు. పలమనేరు నియోజకవర్గంలోని గంగ్రాజుపల్లి, పలమనేరు సమీపంలోని పారిశ్రామిక వాడల్లో కొనసాగుతున్న సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమల వివరాలను ఆయన అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్న అంశంపై ఈ సందర్భంగా జోనల్ మేనేజర్‌తో చర్చించారు. పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి నుంచి వి.కోట వరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకొనేందుకు చాలా అనువైన అవకాశాలు ఉన్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్‌యూనిట్లు పెట్టాలనే యోచన ఉన్న పారిశ్రామిక వేత్తలకు ఆదిశగా సూచనలిచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ ఇస్మాయిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మాజీ వార్డు సభ్యుడు



టీడీపీ తీర్థం పుచ్చుకున్న వెంకటరమణకు చంద్రబాబు అభినందన

కుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు నాను అలియాస్ వెంకటరమణ తెలుగు దేశం పార్టీలో చేరారు. అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒకప్పుడు టీడీపీలోనే ఉన్న నాను, వైసీపీలోకి వెళ్లారు. ఇప్పుడు తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సాధికార సమితి అధ్యక్షుడు జీఎం.రాజు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కల్లూరులో ప్రచారం చేస్తున్న సేవా సమితి కమిటీ సభ్యులు

కల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): సర్వ మతాలను సమన్వయపరిచే త్రైత సిద్ధాంత భగవద్గీతను చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు పెంచల నరసయ్య తెలిపారు. పులిచెర్ల మండలంలో శనివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమానవాళికి సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో ఉందన్నారు. సత్యమైన ఆధ్యాత్మికతను త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కమిటీ సభ్యులు మధు, పెంచలయ్య, పార్థసారథి, కృష్ణమూర్తి, కిరణ్, వెంకటేశ్వర్లు, హర్షవర్ధన్, మాళవిక, రత్నమ్మ, సౌజన్య, భాను, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణానికి చెందిన అగర్తగడ్డ సుబ్బమ్మ శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సుబ్బమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అవినాష్, అమర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీలో 10 శాతం మందికి టీబీ పరీక్షలు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో రోజు వచ్చే ఓపీల్లో 10 శాతం మందికి టీబీ పరీక్షలు తప్పని సరిగా చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్ష అనంతరం టీబీ నిర్ధారణ అయితే వారిని జిల్లా టీబీ నివారణ కార్యాలయాలనికి పంపి, మందులు తీసిచ్చే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ముందుగానే గుర్తిస్తే రోగం నయం చేయడం సులభమన్నారు. 2025 పూర్తయ్యేలోపు టీబీ రహిత జిల్లాగా చిత్తూరును మార్చాలన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం.. టీబీ బాధితులకు పౌష్టికాహారం కోసం అందించే రూ.వెయ్యి బాధితుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల విమర్శ దారుణం: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనతో దేశవ్యాప్తంగా ప్రజలు మనోవేదన చెందుతున్న తరుణంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల.. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాను విమర్శించడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీనిపై షర్మిల వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో ఏపీ అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం, అమరావతి పునఃనిర్మాణానికి విడుదల చేసిన నిధులను గుర్తించి.. తెలుసుకుని మాట్లాడాలని ఆ ప్రకటనలో కోరారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రొంపిచెర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులవలంబిస్తే అధిక లాభాలు గడించవచ్చని ఏవో సుధారాణి అన్నారు. శనివారం రొంపిచెర్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు స్కిల్స్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించాలి, యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులు పంపడం, అందుకోవడం, మార్కెట్ ధరలు, వాతావరణం, పంటల సమాచారం, వ్యవసాయ యాప్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల వివరాలు, రాయితీలు, తదితర అంశాలపై విశదీకరించారు. ఈ వివరాలను తోటి రైతులతో పంచుకొని, వారిని అభివృద్ధిలోకి తేవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో రైతుసేవాకేంద్రం హార్టికల్చర్ అధికారి సుజాత, వీఏఏ వెంకట్రమణ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి జనసేన ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, మే 3 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరు మండలం భీమగానిపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి వైద్యఖర్చులకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం చేశారు. భీమగానిపల్లెకు చెందిన శంకరప్ప(60) సొంత పనులపై ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన శంకరప్పకు ఆస్పత్రి ఖర్చులకు గాను భీమగానిపల్లె జనసేన నాయకులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేసి మదనపల్లె ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోల్లో నలుగురు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. పదోన్నతి పొందిన ఎం.హరిప్రసాద్‌రెడ్డి (గంగాధరనెల్లూరు), ఎల్.పురుషోత్తం(వెదురుకుప్పం), రాజశేఖర్‌బాబు(పులిచెర్ల), రాధాకృష్ణ(రామకుప్పం)లను డీపీవో సుధాకర్‌బాబు శనివారం తన కార్యాలయంలో సత్కరించారు. అంతకుముందు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలతో సమీక్షించారు.

కాసింత ఉపశమనం



ఐరాల, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి జనం అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక కొందరు వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు. శనివారం ఐరాల మండలంలోని వైఎస్ గేటులోని ఓ వ్యవసాయ బావిలో కొంతమంది ఈత కొడుతూ కనిపించారు.



కమతంపల్లె వద్ద నేలకూలిన షెడ్లు

గాలివాన బీభత్సం

పుంగనూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిసర ప్రాంతాల్లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. భీమగానిపల్లె క్రాస్ కృష్ణదేవరాయల విగ్రహం ఎదుట వున్న హోటల్ రేకులు లేచిపోవడంతో ఇంటిలో ఉన్న సరుకులు, వస్తువులు వర్షానికి పూర్తిగా తడిచి ముద్దయినట్లు బాధితురాలు రత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు, స్తంభాలు గాలికి కూలిపోయాయి. అలాగే కమతంపల్లె సమీపంలో ఇటుకల తయారీ కోసం ఏర్పాటు చేసిన షెడ్లు నేలకూలినట్లు యజమాని వెంకటరమణ తెలిపారు. కమతంపల్లెలో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పాళెంపల్లె, చదళ్లలో విపరీతమైన గాలులతో 7 విద్యుత్ స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. పలుచోట్ల టమోటా తోటలు దెబ్బతిన్నాయి.



పాళెంపల్లె వద్ద నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ శాఖకు రూ.11లక్షల నష్టం

చిత్తూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం నాటి గాలివాన బీభత్సానికి విద్యుత్ శాఖకు రూ.11లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. మొత్తం 80 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా.. 33 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు శుక్రవారం రాత్రి నుంచే అధికారులు మొదలు పెట్టారు. కొన్ని గ్రామాల్లో పూర్తయినా, చీకటి కారణంగా అనేక గ్రామాల్లో పనులు ముందుకు సాగలేదు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పూతలపట్టు, చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాల్లో 64 విద్యుత్ స్తంభాలు పూర్తిగా విరిగిపోగా.. 27 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు గురయ్యాయి. వీటి స్థానంలో నూతన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు ఆపరేషన్ డీఈ మునిచంద్ర తెలిపారు. అన్ని ప్రాంతాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు.చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో 12 విద్యుత్ స్తంభాలు నేలమట్టమవగా, 500 మీటర్ల విద్యుత్ తీగలు, 1.28 కిలోమీటర్ల కేబుల్ వైర్లు తెగిపోయాయి. ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయని చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ సురేష్ తెలిపారు. పుంగనూరు డివిజన్‌లో వర్ష ప్రభావం పెద్దగా లేదని, కేవలం నాలుగు విద్యుత్ స్తంభాలు మాత్రమే నేలకొరిగాయని వాటిని కూడా సరిచేయడం జరిగిందన్నారు.



పానాటూరులో పనులు చేయిస్తున్న డీఈ ఆనంద్

నేల కొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

చౌడేపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి):శనివారం సాయంత్రం చౌడేపల్లె మండలంలోని పలు ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది.అగిస్తీగానిపల్లెకు చెందిన రైతు గంగాధర్‌రెడ్డి పొలంలో వ్యవసాయ బోరుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, 2 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.



సోమలలో 40.2 మిమీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 18 మండలాల్లో వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా సోమలలో 40.2, అత్యల్పంగా పెనుమూరులో 0.6 మిమీ వర్షం కురిసింది. మేనెల సగటు వర్షపాతం 4.5 మి.మీ నమోదు కావాల్సివుండగా, గత రెండ్రోజుల్లో సరాసరి 6.6 మిమీ వర్షం కురిసింది. గంగవరంలో 20.2, వెదురుకుప్పంలో 17.4, చిత్తూరులో 13.8, గంగాధరనెల్లూరులో 13.6, గుడిపాలలో 13.4, పులిచెర్లలో 11.2, పలమనేరులో 10.4, యాదమరిలో 7.4, బంగారుపాళ్యంలో 5.2, సదుంలో 5.2, చౌడేపల్లెలో 5, శాంతిపురంలో 4.8, బైరెడ్డిపల్లెలో 3.8, గుడుపల్లెలో 2.4, రొంపిచెర్లలో 1.4, వి.కోటలో 1.2 మిమీ వర్షం కురిసింది.



చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్లకండ్రిగలో నేలరాలిన మామిడి పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ డీడీ మధుసూదనరెడ్డి

435 ఎకరాల్లో పంటనష్టం

చిత్తూరు సెంట్రల్, మే 3(ఆంధ్రజ్యోతి):గాలివానకు మామిడితో పాటు అరటి,బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి.ఉద్యాన శాఖ అధికారులు లెక్క ప్రకారం పెనుమూరు, యాదమరి, చిత్తూరు, గుడిపాల, పలమనేరు, ఐరాల, తవణంపల్లె మండలాల్లో 435 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 425 ఎకరాల్లో మామిడి, 8.5 ఎకరాల్లో అరటి, రెండు ఎకరాల్లో బొప్పాయి, 0.15 ఎకరాల్లో కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయి. పెనుమూరు మండలంలో 30 ఎకరాల్లో మామిడి నేలరాలగా 36 మంది రైతులు నష్టపోయారు. యాదమరి మండలంలో 20 ఎకరాలు, చిత్తూరులో 135 ఎకరాలు, గుడిపాలలో 62.5, పలమనేరులో 97.5, తవణంపల్లెలో 55 ఎకరాలు, ఐరాలలో 25 ఎకరాల్లో మామిడి నేల రాలింది. యాదమరిలో 2.5 ఎకరాల్లో, చిత్తూరులో రెండు ఎకరాల్లో, గుడిపాలలో నాలుగు ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. గుడిపాల, చిత్తూరులో రెండెకరాలో బొప్పాయి పంట దెబ్బతింది. చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్లకండ్రిగలో నేలరాలిన మామిడి పంటను హార్టికల్చర్ డీడీ మధుసూదన రెడ్డి పరిశీలించారు.చిత్తూరు మండలంలోనే అత్యధిక శాతం పంటలకు నష్టం జరిగిందని తెలిపారు.

ప్రతి లెక్క... ఇక పక్కా

'సింగిల్ విండోల్లో లావాదేవీలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే

ముగిసిన కంప్యూటరీకరణ ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోల బలోపేతంలో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 75 సింగిల్ విండోల్లో డిజిటలైజేషన్ పూర్తయ్యింది. దీంతో బ్యాంకుల మాదిరిగా సింగిల్ విండోల్లో లావాదేవీలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి.

ఇటీవలివరకూ సింగిల్ విండోల్లో వ్యవహారాలన్నీ సాధారణ పద్ధతుల్లో జరిగేవి. చేతిరాతలతో రికార్డులను తారుమారు చేయడం,వాయిదాలు చెల్లించకుండా సర్దుబాటు చేయడం, బినామీల పేరిట రుణాలు స్వాహా చేయడం జరిగేది. ఈ సంఘాలను కొంతమంది నేతలు తమ సొంత అవసరాల కోసం నష్టాల్లోకి నెట్టేశారు. ఏళ్ళ తరబడి సాగుతున్న ఈ చేతివాటానికి డిజిటలైజేషన్‌తో చెక్ పెట్టగలిగారు.2023లో చేపట్టిన ఈ ప్రక్రియ పాత రికార్డులన్నీ అందుబాటులో లేకపోవడం, సిబ్బంది అవగాహన లేమి వల్ల నత్తనడకన సాగుతూ వచ్చింది. గంగాధరనెల్లూరు సహకార సంఘంలో లావాదేవీలు ఎక్కువగా ఉండడంతో తీవ్ర జాప్యం జరిగింది.అయితే గత నాలుగు నెలలుగా అధికారుల శ్రద్ధతో డిజిటలైజేషన్ వేగం పుంజుకుంది.సంఘాలు ఏర్పడినప్పటి నుంచి ప్రస్తుత సంవత్సరం మార్చి 31 వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా కేప్చర్ టూల్ (డీసీపీ) అనే సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేశారు. మొత్తం 4.32 లక్షల మంది సభ్యుల్లో 64 వేల మంది మాత్రమే రుణాలు పొందారు. డీసీసీబీ నుంచి సింగిల్ విండోల ద్వారా పంట రుణాల కింద రూ.355 కోట్లు, బంగారంపై రుణాలుగా రూ.150 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.50 కోట్లు వెరసి రూ.555 కోట్లు రుణాలు పొందారు. ఇవన్నీ రాష్ట్ర సహకార శాఖ ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. ఇక నుంచి అడ్డగోలుగా రుణాలు పొందడం కుదరదు.గతంలో రైతులు చెల్లించిన సొమ్మును సొసైటీ సిబ్బంది ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకుని, తర్వాత జమచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇకపై పాతతేదీలను నమోదుచేసే అవకాశం ఉండదు.



చిత్తూరు సింగిల్ విండో కార్యాలయం

డిజిటలైజేషన్ తర్వాత బ్యాలెన్స్ ముగింపు నిల్వల వివరాలు పక్కాగా ఉంటాయి. రైతులు నగదు చెల్లించిన రోజే ఖాతాలో వేయాలి. సొసైటీ ఇచ్చిన అప్పులు, రుణగ్రహీతల వివరాలు, చెల్లింపుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

● ఆన్‌లైన్‌లోనే ఆడిట్ లెక్కలు

సింగిల్ విండోల్లో ఇకపై జమాబంది (ఆడిట్) లెక్కల తనిఖీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఏ రోజుకారోజు లెడ్జర్లతో పనిలేకుండా ఎంట్రీల నమోదు, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూర్లు, బకాయిల వసూళ్ళు, ఎరువులు, ధాన్యం కొనుగోళ్ళు తదితర ప్రక్రియలు సాగుతున్నాయి.మాన్యువల్ విధానంలో నిర్వహించిన విధంగా డిపార్ట్‌మెంట్ ఆడిట్‌తో పాటు ఛార్టెడ్ అకౌంటెంట్ ఆడిట్ జరుగనుంది. కొన్ని సొసైటీల్లో సహకార శాఖ అధికారులు నిర్వహించగా, మిగిలిన చోట్ల సీఏ ద్వారా ప్రక్రియ సాగుతోంది. ప్రస్తుత ఏడాదిలో అధికారులు అటుఇటు మారుతారు.ఇందుకోసం ప్రభుత్వం రెండు నెలల గడువు ఇచ్చింది. ఈ ప్రక్రియను మే నెలాఖరుకు పూర్తిచేయనున్నారు. ఆడిట్‌పై విండో స్టాఫ్‌కు అవగాహన కల్పిస్తామని డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు తెలిపారు.

పరిశ్రమల స్థాపనతోనే మెండుగా ఉపాధి అవకాశాలు

గంగవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు ఎక్కువగా స్థాపిస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శనివారం గంగవరం మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన ఈస్ట్‌మెన్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ద్వారా పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలాల్లో టైలరింగ్‌పై అవగాహన ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈస్ట్‌మెన్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ పలమనేరులో స్థాపించడానికి గల అవకాశాలను పరిశీలించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ గార్మెంట్స్ ద్వారా సుమారు 2 వేల నుంచి 4 వేల మంది వరకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. రోజుకు 8 గంటలు పనిచేయగలమన్న నమ్మకం కలిగిస్తే ఈ గార్మెంట్స్ యజమానులు కంపెనీ స్థాపించడానికి ముందుకు వస్తారన్నారు. ఇప్పటికే పలమనేరు పరిసరప్రాంతాలకు చెందిన 1200 మంది ఎస్.హెచ్.జి మహిళలకు టైలరింగ్‌పై అవగాహన ఉన్నట్లు గుర్తించామని, వారి నైపుణ్యాన్ని పరిశీలించి గార్మెంట్స్ ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందనే ఉద్దేశంతో గతంలోనే పలమనేరు, కుప్పం, వి.కోటలలో అనేక గార్మెంట్స్ కంపెనీలను తీసుకువచ్చామన్నారు. గార్మెంట్స్ కంపెనీలు మరిన్ని పెరగడం ద్వారా రాష్ట్ర జీడీపీ కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఈస్ట్‌మెన్ గార్మెంట్స్ కంపెనీ సీఈవో రితేష్‌కుమార్, జీఎం మొయిద్దీన్, డీఐసీ ఏడీ వెంకటరెడ్డి, ఏపీఐఐసీ మేనేజర్ ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిలతోపాటు నాలుగు మండలాల పరిధిలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంఘమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఆవుల మందపై ఒంటరి ఏనుగు దాడి

● ఒక ఆవు మృతి

పెద్దపంజాణి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆవుల మందపై ఒంటరి ఏనుగు దాడి చేసిన సంఘటన పెద్దపంజాణి మండలంలో చోటు చేసుకుంది. శనివారం మండలంలోని పెనుగొళకల గ్రామ సమీపంలోని పొలాల వద్ద మేత మేస్తున్న ఆవుల మందపై ఒంటరి ఏనుగు దాడి చేసిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఒక ఆవు మృతి చెందగా, మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. మిగతా ఆవులు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాయి. స్థానికులు గట్టిగా కేకలు వేసి పెద్దపెద్ద శబ్దాలతో ఏనుగును అటవీ ప్రాంతం వైపు తరిమివేసినట్లు చెప్పారు. లేనిపక్షంలో మరిన్ని ఆవులు ఏనుగు దాడిలో బలయ్యేవని అన్నారు. అనంతరం స్థానికులు సంబంధిత అటవీ సిబ్బందికి, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గతంలోనూ ఇదే గ్రామ సమీపంలో ఓ వ్యక్తి వ్యవసాయ పనులు ముగించుకుని వస్తుండగా ఏనుగు దాడి చేయడంతో మృతి చెందిన విషయం విదితమే. ఇటీవల కాలంలో పొలాలు, బోరుపైపులు, మోటర్లపై ఒంటరి ఏనుగు దాడులు పెరిగిపోతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి వీటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గాయపడ్డ ఆవును పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది, స్థానికులు

పలమనేరులో రేపు 'పీజీఆర్ఎస్'

పలమనేరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో ఈనెల 5వతేది సోమవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజలనుంచి సమస్యల అర్జీలను స్వీకరించి, పరిశీలించి పరిష్కారం చేస్తారని తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించి పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో చిత్తూరులో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆప్రకటనలో తెలిపారు.

రైతుసేవా కేంద్రాల్లో రేషనలైజేషన్ షురూ

చిత్తూరు సెంట్రల్, మే 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు మరింత చేరువగా గ్రామీణ సహాయకుల్ని తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే ఈ ప్రక్రియలో గ్రామ సచివాలయ క్లస్టర్ల ఆధారంగా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని విభజించనున్నారు.అదనంగా ఉన్నవారిని ఇతర వ్యవసాయ కార్యకలాపాలకు ఉపయోగించుకోనున్నారు.

క్లస్టర్లుగా విభజన: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,53,209 ఎకరాల్లో 3,27,373 మంది రైతులు వ్యవసాయ, ఉద్యాన, పట్టు పంటలను సాగు చేస్తున్నారు.946 రైతు సేవా కేంద్రాలుండగా, 568 మంది గ్రామీణ సహాయకులు సచివాలయాల్లో పనిచేస్తున్నారు.వీరిలో 280మంది గ్రామీణ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏ), 171 మంది గ్రామీణ హార్టికల్చర్ అసిస్టెంట్లు (వీహెచ్ఏ), 117 గ్రామీణ సెరికల్చర్ అసిస్టెంట్లు (వీఎస్ఏ) ఉన్నారు.రేషనలైజేషన్‌లో భాగంగా 946 రైతు సేవా కేంద్రాలను 473 క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. క్లస్టర్‌కు ఒక వీఏఏ కానీ, ఒక వీహెచ్ఏ కానీ, వీఎస్ఏను కానీ నియమించాలని అధికారులు భావిస్తున్నారు. వీటితో పాటు 952 గ్రామ సచివాలయాల ద్వారా వీరి సేవలు వినియోగించుకునేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. రెండు రైతు సేవా కేంద్రాలను ఒక క్లస్టర్‌గా చేస్తే అందులో గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకుల్లో ఒకరిని నియమించనున్నారు. ఏ ప్రాంతంలో ఏయే పంటలసాగు ఉంటుందో ఆ రకమైన పంటలకు సంబంధించి సహాయకుల్ని అదనంగా నియమించే వీలుంది. వీటితో పాటు మండల స్థాయిలో ఇద్దరిని కాని, క్లస్టర్ స్థాయిలో ఒక సహాయకుడి గానీ నియమించనున్నారు.



జాతీయ రహదారిపై మిలటరీ వాహనాలు

ఆయుధ పరికరాలున్న సైనిక వాహనాలు ఒకదాని వెనుక ఒకటి శనివారం కోల్‌కత్తా- చెన్నై జాతీయ రహదారిపై దూసుకుపోతూ కనిపించాయి. దాదాపుగా 50 వాహనాలు ఇలా వెళ్లడంతో తిరుపతి జిల్లాలోని తడ- సూళ్లూరుపేట మధ్య ప్రజలు ఆసక్తిగా చూశారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో యుద్ధవాతావరణం నేపథ్యంలో చెన్నై వైపునకు దూసుకుపోయిన ఈ వాహనాలను చూసి ప్రజలు రకరకాల వ్యాఖ్యానాలు చేశారు.

- తడ, ఆంధ్రజ్యోతి



కాసింత ఉపశమనం

ఐరాల, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి జనం అల్లాడి పోతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక కొందరు వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు. శనివారం కూడా వైఎస్ గేటులోని ఓ వ్యవసాయ బావిలో కొందరు ఈత కొడుతూ కనిపించారు.

ఓపీలో 10 శాతం మందికి టీబీ పరీక్షలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో రోజు వచ్చే ఓపీల్లో 10 శాతం మందికి టీబీ పరీక్షలు తప్పని సరిగా చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్ష అనంతరం టీబీ నిర్ధారణ అయితే వారిని జిల్లా టీబీ నివారణ కార్యాలయాలనికి పంపి, మందులు తీసిచ్చే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ముందుగానే గుర్తిస్తే రోగం నయం చేయడం సులభమన్నారు. 2025 పూర్తయ్యేలోపు టీబీ రహిత జిల్లాగా చిత్తూరును మార్చాలన్నారు. దీని కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం.. టీబీ బాధితులకు పౌష్టికాహారం కోసం అందించే రూ.వెయ్యి బాధితుల ఖాతాల్లో జమచేయాలన్నారు. జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో 'మైనారిటీ వెల్ఫేర్' సెక్రటరీ



శ్రీధర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మే 3 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవండి



ప్రచారంలో పాల్గొన్న సమితి సభ్యులు

పెనుమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన తన బృందంతో తలారిపల్లె, చలంపాళ్యం, గొబ్బిళ్లమిట్ట, గాంధీపురం, చిప్పారపల్లె, వడ్లవానిమిట్ట, గొల్లపల్లె, తిరివిరెడ్డిపల్లె, గొల్లపల్లె, ఉప్పిలిపల్లె గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమణారెడ్డి, రేణుకాదేవి, పద్మావత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాదమరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై తాగునీరు వృథాగా పోతోందని 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ ఝాన్సీ పయని, పంచాయతీ కార్యదర్శి సుకుమార్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో గుంత తవ్వి దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మతులు చేశారు.

ఈదురుగాలుల బీభత్సం

● నేలరాలిన మామిడి కాయలు



రాలిపోయిన మామిడికాయలను చూపుతున్న రైతు

యాదమరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుచోట్ల శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. తీగలపై చెట్లు పడడంతో కొన్నిచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కీనాటంపల్లెకి చెందిన అమరనాథ నాయడు, హరి నాయుడు, రఘు నాయుడు, ఆరిమాకులపల్లెకి చెందిన ధరణిప్రకాష్, గోపాల్ రెడ్డి, బాలాజి, హేమగిరి, గుణశేఖర్ రాయల్, నరేష్ రాయల్, మరికొందరు రైతుకు చెందిన మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. పెట్టుబడి కూడా చేతికందదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే.. ఎవరైతే ఇన్సూరెన్స్ కంపెనీలో నగదు చెల్లించి బీమా సౌకర్యం కోసం దరఖాస్తు చేశారో వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం కోసం నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని హార్టికల్చర్ ఏవో మోనిక తెలిపారు.

గాలివానకు ఇంటి పైకప్పు ధ్వంసం



దేవళంపేటలో ధ్వంసమైన ఇంటి పైకప్పు

వెదురుకుప్పం, మే 3(ఆంధ్రజ్యోతి): గాలివానకు శుక్రవారం రాత్రి వెదురుకుప్పం మండలం దేవళంపేటకు చెందిన మణి ఇల్లు పైకప్పు కూలిపోయిందని బాధితుడు శనివారం తెలిపారు. బాధిత కుటుంబాన్ని టీడీపీ యువత నాయకుడు బాష్యం సతీష్‌నాయుడు శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునే విధంగా ప్రభుత్వ విప్ థామస్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

విద్యుత్ తీగ తెగిపడి పాడి ఆవు మృతి



వెదురుకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగిపడి వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ రెడ్డేపల్లె దగ్గర ఓ పాడి ఆవు చనిపోయింది. ఈ మేరకు తిరుమలయ్యపల్లె గ్రామ మాజీ సర్పంచ్ మొగిలయ్య శనివారం తెలిపారు.

మోదీ, చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

శ్రీరంగరాజపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితుడు బోడపాటి లోకనాధం నాయుడు అన్నారు. శనివారం పుల్లూరు క్రాస్ రోడ్డులో మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో జరిగిన సభలో చంద్రబాబు గతంలో చేసిన అభివృద్ధిని మోదీ ప్రస్తావించారని చెప్పారు. వీరిద్దరి కలయికతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మాజీ జడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు, వాసు నాయుడు, రాజగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమిలో రోడ్డు వేశారని తవ్వేశారు!



ఎక్స్‌కవేటర్‌తో తవ్వేసిన సిమెంటు రోడ్డు

పెనుమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లే రోడ్డును తన పట్టా భూమిలో వేశారంటూ ఎక్స్‌కవేటర్‌తో ఓ రైతు తవ్వేశారు. సుమారు 50 అడుగుల వరకు తవ్వేయడంతో విషయం తెలుసుకున్న ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి శనివారం సంఘటన స్థలానికి పోలీసులతో కలిసి వెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని.. అప్పటి వరకు మిగిలిన రోడ్డును తవ్వొద్దని సంబంధిత రైతు ఉషాదేవి సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రోడ్డు తవ్వేయడం చట్ట విరుద్ధమని, పట్టా భూమిలో ఉన్నా.. 2020లో నిర్మించినప్పటి నుంచి ఈ రోడ్డుమీదుగానే చాలా గ్రామాలకు జనం రాకపోకలు సాగిస్తున్నారని.. సమస్య ఉంటే రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా ఉషాదేవికి, పక్కనే ఉన్న దళితవాడవాసులకు మధ్య రోడ్డు వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రోడ్డు తన పట్టా భూమి మధ్యలో ఉందని.. దారి కావాలంటే తన పొలం చివర్లో విడిచిపెడతామని ఆమె చెబుతున్నారు.

'స్వామి'పై ప్రభుత్వ విప్ థామస్ ధ్వజం

వెదురుకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ ధ్వజమెత్తారు. శనివారం తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి మా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. దీన్ని తట్టుకోలేక చానళ్ల ముందు నారాయణస్వామి పసలేని ఆరోపణలు చేస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలు రెండు పర్యాయాలు అవకాశమిస్తే రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టి కూడా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదు. నేను అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.50కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. ఉపాధి నిధులతో గోకులం షెడ్లు, నీటితొట్టెలు, పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు, బడులకు మరమ్మతులు చేశాం. పారిశ్రామిక కారిడార్, పెనుమూరు పీహెచ్‌సీలో డయాలసిస్ యూనిట్, పాలసముద్రం మండలంలో ఆదర్శ గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. కృష్ణాపురంరిజర్వాయర్ నీటివృథాను అరికట్టి సాగు, తాగునీటి వసతులు మెరుగుపరచడంపై దృష్టి పెట్టాం. చెరకు టన్నుకు తమిళనాడులో ఇస్తున్న రూ.4వేలను ఇక్కడా చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నాం. మామిడి బోర్డును నియోజకవర్గంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇకనైనా నారాయణస్వామి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలి' అని థామస్ హితవు పలికారు.

షర్మిల విమర్శ దారుణం: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనతో దేశవ్యాప్తంగా ప్రజలు మనోవేదన చెందుతున్న తరుణంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల.. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాను విమర్శించడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీనిపై షర్మిల వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో ఏపీ అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం, అమరావతి పునఃనిర్మాణానికి విడుదల చేసిన నిధులను గుర్తించి.. తెలుసుకుని మాట్లాడాలని ఆ ప్రకటనలో కోరారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న డీపీవో సుధాకర్‌రావు

చిత్తూరు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోల్లో నలుగురు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. పదోన్నతి పొందిన ఎం.హరిప్రసాద్‌రెడ్డి (గంగాధరనెల్లూరు), ఎల్.పురుషోత్తం(వెదురుకుప్పం), రాజశేఖర్‌బాబు(పులిచెర్ల), రాధాకృష్ణ(రామకుప్పం)లను డీపీవో సుధాకర్‌బాబు శనివారం తన కార్యాలయంలో సత్కరించారు. అంతకుముందు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలతో సమీక్షించారు.

ధర్మరాజుల స్వామి ఉత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న జీఎం రాజు, ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం యామగానిపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర వన్నెకుల సాధికార సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జీఎం రాజు ఆహ్వానం పలికారు. అమరావతిలోని సీఎం స్వగృహంలో కుప్పం నాయకులు శనివారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవం ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి రాజు సీఎంకు అందజేశారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాలు ఇప్పటికే అంకురార్పణతో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ద్రౌపదీ జననం, ద్రౌపదీ కల్యాణం, అర్జున తపస్మాన్, పుష్పపల్లకి, రథోత్సవం, అర్జునుడు ఆవులను మళ్లించుట, ఇలావంతుని బలి ఉత్సవాలు వరుసగా జరిగి, ఈనెల 19వ తేదీన దుర్యోధన వధ, అగ్నిగుండ మహోత్సవాలు జరుగుతాయి. 20వ తేదీన ధర్మరాజు పట్టాభిషేకంతో మహాభారత ఉత్సవాలు ముగుస్తాయి. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి సేవించుకునే ఈ మహోత్సవాలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా విన్నవించారు. ఆయన ఆహ్వానాన్ని మన్నించిన చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వీలుచూసుకుని రావడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు వీరివెంట ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణానికి చెందిన అగర్త గడ్డ సుబ్బమ్మ శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సుబ్బమ్మ కుటుంబీకులకు పార్టీ తరఫున రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు.

ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటా

● జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్



మోహన్‌మురళికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న థామస్

శ్రీరంగరాజపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటానని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ భరోసా ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మూలూరుకు చెందిన టీడీపీ కార్యకర్త గిరిని శనివారం పరామర్శించారు. చిన్న తయ్యూరులో కల్వరి మౌంట్ చర్చి ఆధ్వర్యంలో సీఎస్ఐ డయాసెస్ ఆఫ్ మద్రాస్ ఫ్యామిలీ ఫెస్టివల్ కార్యక్రమంలోనూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ద్రౌపది అమ్మవారి ఆలయానికి థామస్ శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళికి థామస్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి, రాధా రుక్మిణి సమేత కృష్ణమూర్తి ఆలయంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం వేడుకలకు థామస్ శనివారం హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఇలావంతుని వధ'



వెదురుకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఇలావంతుని వధ ఘట్టం ఆకట్టుకుంది. ఉదయం ఆలయం వద్ద యజ్ఞ పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

బాధితుడికి జనసేన ఆర్థిక సాయం

పుంగనూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం భీమగానిపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి వైద్యఖర్చులకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం చేశారు. భీమగానిపల్లెకు చెందిన శంకరప్ప(60) సొంత పనులపై ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన శంకరప్పకు ఆస్పత్రి ఖర్చులకు భీమగానిపల్లె జనసేన నాయకులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



పుంగనూరులో పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు సాధన కమిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ రేగంటి దేవానంద్ తెలిపారు. శనివారం పుంగనూరు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. తమ సమస్యలు తీర్చాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు పోస్టుకార్డుల ద్వారా ఉత్తరాలు రాస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పాత పింఛన్ పద్ధతిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డి, రాజేశ్వరి, సందీప్, శ్రీధర్, మణి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ బడి

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటుతున్న విజయపురం జడ్పీ ఉన్నత పాఠశాల



విజయపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మండల కేంద్రంలోని విజయపురం జడ్పీ ఉన్నత పాఠశాల సత్తా చాటుతోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల టెన్త్ విద్యార్థిని అలేఖ్య 592 మార్కులు సాధించింది. దీంతో మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 47 మందికి 29 మంది పాసై 62 శాతం ఫలితాలొచ్చినా, 500 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులు పది మందికి చేరుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 49 మందికి 49 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కూడా ఈ పాఠశాల విద్యార్థిని జశ్విత 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

ఉపాధ్యాయుల సహకారంతోనే..



ఉపాధ్యాయుల సహకారంతోనే 592 మార్కులు తెచ్చుకున్నాను. పాఠ్యాంశాలను అవగాహన చేసుకున్నాను. ఇంట్లో కూడా నా తల్లి ప్రోత్సహించారు.

- అలేఖ్య, విద్యార్థిని

ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే..



ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే పదో తరగతి ఫలితాల్లో మా విద్యార్థిని అలేఖ్య జిల్లా స్థాయిలో స్థానం సంపాదించింది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం క్లాసులు, ప్రతి వారం టెస్టులు నిర్వహించాం.

- శ్యామల, ప్రధానోపాధ్యాయురాలు, విజయపురం

సంక్షిప్తంగా..

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 19 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా నగరంలో నిర్వహించిన తనిఖీల్లో 19 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించి, వారిపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం నిందితులను కోర్టులో హాజరుపరచగా విచారించిన జడ్జి ఉమాదేవి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని చెప్పారు.

సాంకేతిక విజ్ఞానంపై రైతులకు అవగాహన

వెదురుకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సీడీకండ్రిగ, అన్నూరు గ్రామాల్లో సాంకేతిక విజ్ఞానంపై రైతులకు శనివారం అవగాహన గ్రామసభలు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగాయి. స్మార్ట్‌ఫోన్ల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. యూట్యూబ్‌ల్లో రైతులకు ఉపయోగపడే చానళ్ల గురించి తెలియపరిచారు. ఏవో హేమలత, ఏఈవో గాయత్రి, మానిటింగ్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గాంబ హుండీ ఆదాయం రూ.1.88 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చిత్తూరు కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయ హుండీ లెక్కింపును ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. రూ.1,88,385 ఆదాయం వచ్చింది. రెండు నెలల కాలంలో ఈ ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాల స్వామికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వన వేణుగోపాలుడు

వెదురుకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను, మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ఆదర్శ రైతును సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ విస్తరణ సిబ్బంది

రామకుప్పం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చునని ఎంటీ లక్ష్మీరెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని గడ్డూరులో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. గ్రామంలో రైతులందరూ పూర్తి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతులను సన్మానించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంటీ జయప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సమైక్య సిబ్బంది, వీవోలు, వీవో లీడర్లు, రైతులు పాల్గొన్నారు.